# పనిమనిషి-1

రాధాకృష్ణ ఢిల్లీలో ఒక ప్రైవేటు కంపెనీలో ఇంజనీరుగా చేరి ఒక పది సంవత్సరాల య్యింది. సంఘటనా బహుళమైన ఒక దశాబ్దంలో మొదట ఐదు సంవత్సరాల పాటు అతనొక బ్యాచెలర్‌గానో, ఎలిజబుల్ బ్యాచలర్‌గానో వెలిగాడు. అతనికి సాయం త్రాలు, సెలవు రోజులు వినోదాల వేళలుగా గడిచాయి. అడగడానికి, ఎవరూ లేరు.. ఎక్కడ తిరిగినా, గుర్తుపట్టే వారెవరూ లేరు. దీనితోపాటు, సమ వయస్కులై మొహమాటం ఏమాత్రం లేని స్నేహితులు కూడా ఉన్న ఢిల్లీలోనే, 'పెద్దాపురం' ఏర్పరచుకోవడం ఏం కష్టం? జీవితాన్ని అంటే యవ్వనాన్ని అతను సంపూర్ణంగా అనుభవించాడు. అయితే, ఎలిజిబెత్ బ్యాచ్‌లర్‌గా గూడా అతను వెలిగాడంటే అర్థం ఏమిటి? అతను వెళ్లే దాదాపు ప్రతి ఇంట్లో (ఆంధ్రావాళ్లు ఇళ్లు మాత్రం) అతనికి మామూలుగా వి.ఐ.పి. సత్కారం జరుగుతుంది. మంచి వయసులో వున్న అమ్మాయి లున్న ఇళ్లలోకే, అయితే ఆ తరుణీమణులు ''బావ''తో మాట్లాడడానికి అతనికి, 'స్పెషల్ ట్రీట్‌మెంట్' దొరికేది. అంటే దగ్గిర బంధువులలో పెళ్లి కావలసిన అమ్మాయిలు లేని కుటుంబం, ఈ ప్రపంచంలో ఎక్కడైనా వుంటుందా? కాని, రాధాకృష్ణమాత్రం చాలా మంచివాడు. ప్రిన్స్‌పిల్స్ వున్నవాడు. ఎలిజిబెత్ బాచ్‌లర్‌గా అతను ఏ అమ్మాయికిగాని, ఏ కుటుంబానికి గాని ఎప్పుడూ మోసం చేయలేదు.

అలాంటి మంచివాడైన రాధాకృష్ణ వలపులు, తలపులు అని ఏమీ చూడకుండా పెద్దలు నిర్ణయించిన ప్రకారం ఆముదాల వలసలో కుముదం అనే అమ్మాయిని పాణిగ్రహణం చేసుకున్నాడు. పాణితో కాణీ రాలేదని కాదు, అదిగూడా మంచిగానే వచ్చింది. ఆ పెళ్లి జరిగి ఇప్పుడు అయిదు సంవత్సరాలయింది. ఒక పంచవర్ష ప్రణాళికా కాలం లోపల ఆ యువ జంటకు లభించిన కార్యసిద్ధులు అతని భాషలో చెప్పాలంటే, ఒక నట్టు మరియు ఒక బోల్టు. ఆ నట్టుకు ఇప్పుడు నాలుగు సంవత్సరాలు నిండింది. బోల్టుకు రెండు సంవత్సరాలు. ఈ జగత్‌కారకుడు, అతి కారుణ్యంవల్ల ఫ్యామిలీ కంప్లీటయింది. అందుకే శ్రీమతి రాధాకృష్ణకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ కూడా సరియైన సమయంలో జరిగింది. ఇంక వాళ్లకు, సంతాన గోపాలం అనే విష(యా)నం తరం భయం అనే విషయం గురించి భయమే లేదు.

కాని ఇప్పుడు వాళ్లను బాధపెట్టే సజీవ ప్రశ్న ఏమిటి? సంతానవతి అనే బిరుదానంతర బిరుదం తీసుకున్న కుముదం అనే శ్రీమతి రాధాకృష్ణ ఒక పెద్ద కుటుంబానికి చెందిన స్త్రీ. అందువల్ల ఆమెకు వంటగదిలో పెద్దపరిచయం లేదు. పెళ్లి తరువాత ఢిల్లీకి వచ్చేటప్పుడు, ఆమెకు సహాయంగా, ఒక పెద్దావిడకూడా వచ్చింది. ఆమె వంట విషయాలు మాత్రం బాగా చూసుకొనేది. ఏప్రిల్ నెలలో ఢిల్లీకి చేరిన, ఆ పెద్దావిడకు, మే నెలలో అక్కడ వుండే వేడి చాలా ఎక్కువ అని అనిపించింది. అందుకే ఆమెకోసం ఆ రాధాకృష్ణ దంపతులు ఒకటిన్నర ఎయిర్‌కూ

లర్లు కొన్నారు. ఒకటి పెద్దది. ఆమె చిన్న గదికి ఒక చిన్నది. పెద్దావిడకు చాలా సంతోషమయింది. నవంబరు, డిసెంబరు దాటి పోయేటప్పుడు 'అయ్యో చలి' అనే ఒకరోగం ఆమెను దాటిపోయేది కాదు. జనవరి అయ్యేసరికి ఆమెకు ఆ చలి చాలా అసహ్యంగా అనిపించింది. స్వెట్టరు, హీటరు, రజాయి అన్నీ వున్నాగూడా, ఆమె కంప్లైంటు మాత్రం తగ్గలేదు. మరో వేసవి కాలం గూడ దాటిపోయింది. ఇంతలోపల, మార్చినెలలో మొదటి బిడ్డ; ఆడబిడ్డ పుట్టింది. ఆ ప్రసవం కోసం, కుముదం తల్లి ఢిల్లీకి వచ్చి నాలుగు నెలలపాటు వాళ్లతోపాటు వుంది. ఆ పాపకు ఆరు నెలలు అయ్యేటప్పటికి ''అయ్యో, చలికాలం మళ్లీ వస్తుందే'' అని భయపడి ఆ అరవైరెండు సంవత్సరాల పని మనిషి, ఆంధ్రాదిశకు వెళ్లే ధూమశకటంలో ఎక్కింది. దానితర్వాత ఈ మూడున్నర సంవత్సరాలపాటు, ఆంధ్రానుంచి ఒక పని మనిషికూడా రాలేదు. ఢిల్లీలో దొరుకుతున్న పార్టటైమ్ ఆడ పనివాళ్ల సహాయంతో, కొన్ని ఇబ్బందులున్నా గూడా, కుముదం కార్యకలాపాలు అలాగే సాగించింది. ఇద్దరు చిన్న పిల్లలతో సహా ఇంటిపని గూడా చూడాలంటే దానిలో వున్న కష్టాలన్నీ చిల్లర వ్యాపారంలా కాదని, పెళ్లికాని పిల్లలకు గూడా తెలును. హిందీలో మాత్రం మాట్లాడే ఆడ పనివాళ్లతో వుండే పీకులాట ఆమె ఎలాగైనా సహిస్తుంది. కాని వాళ్లు అశ్రద్ధతోగాని, తెలివితక్కువ తనంతోగాని, ఆ చిన్న పిల్లలకు కలిగే అసుఖాలను, ప్రమాదాలను సహించడం కష్టం. అదంతా తలచుకుంటే, కుముదంకు ఏడుపు వచ్చేది. సొంత వూరునుంచి, ఒక ఆడ పనిమనిషిని ఎలాగైనా ఏర్పాటు చేసి పంపమని, ఆమె ఎన్నోసార్లు చాలా దయనీయంగా కోరుతూ తల్లికి ఉత్తరాలు రాసింది.

అలా వుండగా, ఒక రోజు వచ్చిన శుభవార్త ఆ దంపతులకు శీతల వర్షం కురిసింది. కుముదం తల్లి ఉత్తరంలో ఒక 55 సం.ల మంచి పనిమనిషిని ఏర్పాటు చేసినట్లు, చాలా సంతోష పూర్వకంగా రాసింది.

రెండు రోజులలో ఆ రాధాకృష్ణ కుటుంబం వూరికి బయలుదేరారు. రాధాకృష్ణకు కేవలం పదిరోజుల సెలవు మాత్రం దొరికింది.

ఊరికి చేరగానే, కుముదం, ఆ పనిమనిషిని ఇంటికి పిలిపించి, ఒక ఇంటర్వ్యూ జరిపింది. ఆమెకు మాత్రమే కాదు, రాధాకృష్ణకు కూడా ఆవిడ బాగా నచ్చింది. ఆ మొహం చూస్తే ఆమె ఒక మంచి కుటుంబం నుంచి వచ్చిందని తెలుస్తుంది. ఆమె గంభీర వదనంలో చందన తిలకం, చిరునవ్వు చెదరదు. పైగా చేపలు, మాంసం బాగా వండగలనని చెప్పగానే రాధాకృష్ణ నోటిలో ''ఆంటినపేట్''గానే నీళ్లూరాయి. కుముదం కూడా చాలా సంతోషించింది. ''ఈమె వుండే విషయంలో ఇహ భయపడనవ సరం లేదు'' అని ఆమెకు ధైర్యం కలిగింది. సమయమేమీ వృధా కాకుండా, ఆవిడకు ఆరు రవికలు కుట్టించారు. తరవాత నాలుగు చీరలు, కొన్ని కావాల్సిన చిల్లర వస్తువులన్నీ కొన్నారు. ఆమె ఇంటిలో ట్రంకు పెట్టెలు మాత్రమే వున్నాయని చెబితే ఆమె వస్తువులను పెట్టుకోవడానికి ఒక సూట్ కేసు గూడా కొని ఇచ్చారు. అడ్వాన్సు

జీతంగా డబ్బేమీ అక్కరలేదని ఆమె చాలా వినయ పూర్వకముగా చెప్పేటప్పటికి రాధాకృష్ణకు చాలా సంతోషం కలిగింది.

ఢిల్లీకి వెళ్ళే రోజు ఆసన్నమయింది. చివఱకు, పొద్దున్నే స్నానం చేసి, తిలకం పెట్టి, ముఖంలో చిరునవ్వుతో ఆమె ఇంటికి వచ్చేటప్పటికి కుముదం సంతోష పడింది.

రైలులో రాధాకృష్ణ కుటుంబ సభ్యులతోనే ఆవిడ కూడా కూర్చుంది. కుముదం అప్పుడప్పుడు ఆమెతో మాట్లాడుతూ వుండేది. చిన్న బాబు కయితే, ఆవిడ చాలా బాగా నచ్చినట్టుంది. ఆవిడ ఒడిలో కూర్చుని ముద్దు ముద్దు మాటలు చెబుతూ ఆడుకుంటున్నాడు. చివరకు, రైలు ఢిల్లీ చేరింది. ఒక కూలీవాడు సామానంతా తీసి బయట పెట్టాడు. ఆవిడ తన బ్యాగును చేతిలో తీసుకుని, ప్లాట్‌ఫామ్‌పై అటూ ఇటూ చూస్తూ నిలబడింది. రాధాకృష్ణగాని, కుముదంగాని, ఓపిక లేని ఆమె చూపులను గమనించలేదు.

ఒక యువకుడైన మిల్ట్రీవాడు పరుగెత్తుకొంటూ ఆమెదగ్గరకొచ్చి, ఒక చేతితో ఆమెను గట్టిగా పట్టుకొన్నాడు. ''నేను రైలు మొదటనుంచి, చివర వఱకు వెతికి వెతికి వచ్చాను. ప్రయాణం బాగా జరిగిందా అమ్మా'' అని అడిగాడు.

''ఇతనెవరమ్మా మీ కొడుకా'' అని కుముదం అడిగింది.

''ఇతను నా రెండవ కొడుకు. ఇక్కడ పోస్టింగై వచ్చి రెండు సంవత్సరాలు దాటింది. ఇతనికి ఈ మధ్య ఒక కొడుకు గూడా పుట్టాడు. నేను అతన్ని ఇంకా చూడలేదు. అందుకే మీతోవచ్చి ఎంత తొందరాగా వీలైతే అంత తొందరగా ఆ అబ్బాయిని చూద్దామనుకున్నాను. అయితే నేను వెళ్లి వస్తాను''.

''మీరు వెళ్లి ఎప్పుడు తిరిగి వస్తారు? అదీ కాక మీకు మా ఇల్లు ఇక్కడా అని తెలియదు గదా! మీ అబ్బాయిగూడా వచ్చి, మా ఇల్లు చూస్తే తరువాత నిన్ను అక్కడ దింపడం అతనికి సులభం అవుతుంది. నీ మనుమడిని చూసేసి, ఈరోజే తిరిగి వచ్చేయ్'' అని కుముదం ఊపిరి వదలకుండా చెప్పింది.

''చూడమ్మా, నేను మీ ఇంట్లో పని చేయడానికి కాదు ఇంత దూరం వచ్చింది. అది నాకవసరం లేదు. నా కొడుకును చూడడానికి నాకు ఢిల్లీకి రావాలని అనిపించింది. మీరు గూడా ఇటే వస్తున్నారని తెలిసి, నేను మీతో వచ్చాను అంతే. తరువాత వీలైనప్పుడు, ఎప్పుడైనా కలుస్తాను'' రా, బాబూ మనం వెళ్దాం అని చెప్పి రాధాకృష్ణదం పతులకు ఎలాంటి విక్రియకుగాని, ప్రతి క్రియకుగాని అవకాశ మివ్వకుండా మిలటరీ చేతికి బ్యాగు ఇచ్చి ఆమె చకచకా వెళ్లిపోయింది.

కుముదం తలమీద పిడుగు పడినట్టు అర్థబోధావస్థలో నిలబడిపోయింది. రాధాకృష్ణ అయితే, ఇది నిజమా లేక స్వప్నమా - ఇలాంటి మోసాలు ఈ లోకంలో జరుగుతాయా, అని ఆశ్చర్యపడి నిశ్చేష్టుడై అలాగే నిలబడిపోయాడు.